సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం, 5, ఏప్రిల్, 2023



అగ్రహారం అంజన్న ముస్తాబు

హనుమాన్ చిన్న జయంతికి అగ్రహారం అంజన్న ముస్తాబు అయ్యాడు. అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 8లో▸



కుజదోష నివారణ పూజలు

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు వైభంగా నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

కాలం నువ్వు కలిసే వ్యక్తులను, హృదయం నువ్వు కోరే వ్యక్తులను, నీ ప్రవర్తన నీతో ఉండే వారిని నిర్ణయిస్తుంది.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6.33	గురు 4.41

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

త్వరితగతిన పనులు పూర్తిచేయాలి



పనులు పరిశీలిస్తున్న రమేశ్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: వైద్య కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రమేశ్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరుశివారులో నిర్మిస్తున్న వైద్య కళాశాల నిర్మాణ పనులను, జిల్లా ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న రెండోఅంతస్తు పనులను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ మురళీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'హమాలీ' సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): హమాలీ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎలగంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లో హమాలీ కార్మికులతో సీఐటీయూ నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎల్లారెడ్డి మాట్లాడుతూ 55 సంవత్సరాలున్న హమాలీ కార్మికులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలన్నారు. హమాలీబంధు అమలు చేసి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో హమాలీ చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, అర్హులైన వారికి డబుల్‌బెడ్‌రూమ్‌లు మంజూరు చేయాలని కోరారు. హమాలీ సంఘం మండల అధ్యక్షుడు పిట్ల రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


టెన్త్ పరీక్షకు ఏడుగురు గైర్హాజరు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు జిల్లావ్యాప్తంగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు జిల్లా విద్యాధికారి రమేశ్ తెలిపారు. రెగ్యులర్ విధానంలో 6,487మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 6,480 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రైవేటుగా అభ్యర్థిగా మరొకరు హాజరైనట్లు విద్యాధికారులు తెలిపారు.

కంటి వెలుగులో 3,265 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో మంగళవారం కంటి వెలుగు-2లో 3,265 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 546 మందికి రీడింగ కంటి అద్దాలు, 554 మందికి పాయింట్ కంటి అద్దాలు పంపిణీ చేశారు. జిల్లాలోని 23 ప్రాంతాల్లో 207 మంది సిబ్బంది కంటి వెలుగు శిబిరాల్లో పాల్గొన్నారు. 49 రోజులుగా జిల్లాలో 1,82,369 మందికి కంటి పరీక్షలు చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు తెలిపారు.

ముదిరాజ్‌లు శాసించే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న పర్శ హన్మండ్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): ముదిరాజ్‌లు రాజకీయాల్లో శాసించే స్థాయికి ఎదగాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు అన్నారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ముదిరాజ్ గర్జన సభలో ఆయన పాల్గొన్నారు.హన్మండ్లు మాట్లాడుతూ..ముదిరాజ్‌ల సమస్యలను ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన హన్మండ్లును ముదిరాజ్ కులస్తులు సత్కరించారు. గ్రామశాఖ అధ్యక్షుడు గోపాల్,నర్సింలు, ఆంజనేయులు, బాలరాజు, రమేష్, సంతోష్, శ్రీనివాస్, దేవయ్య ఉన్నారు.

'హెల్త్ ప్రొఫైల్' ఏమైంది?



సిరిసిల్ల టీ-డయాగ్నొస్టిక్ సెంటర్‌లో రక్తపరీక్షలు(ఫైల్)

- మరుగున పడిన పైలెట్ ప్రాజెక్టు
- జిల్లాలో 3.47 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు
- 'ఆన్‌లైన్'లో నమోదుకాని ఆరోగ్య సమాచారం
- ఇంటింటా సర్వేలు.. రక్తపరీక్షలు
- జిల్లాలో 91శాతం పూర్తి



ఈ-హెల్త్ ప్రొఫైల్‌లో భాగంగా రక్తపరీక్షలు(ఫైల్)

సర్వే దాదాపు పూర్తి అయింది



జిల్లాలో ఈ-హెల్త్ ప్రొఫైల్ సర్వే వేగంగా పూర్తి చేశాం. ఆ వివరాలు అన్నీ అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకుని డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వాల్సి ఉంది. మా పరిధిలో సర్వేను పూర్తి స్థాయిలో చేశాం. జిల్లాలో 3.47 లక్షల మంది హెల్త్ ప్రొఫైల్స్ రికార్డులు సిద్ధంగా ఉన్నాయి.

– డాక్టర్ సుమన్ మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

ఈ- హెల్త్ ప్రొఫైల్ స్వరూపం

జిల్లాలో గ్రామాలు	255
పట్టణాలు	02
పీహెచ్‌సీలు	18
సర్వే చేసిన వైద్య బృందాలు	203
జిల్లాలో 18 ఏళ్ల పైబడిన వారు	3,80,905
ఇప్పటికే సర్వే పూర్తి అయినవారు	3,47,565

సిరిసిల్ల: 'దేశంలోనే మొట్టమొదటిసారిగా సమగ్ర ఆరోగ్య సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ రాజన్న సిరిసిల్లలో సాగుతోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ-హెల్త్ ప్రొఫైల్స్ సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల, ములుగు జిల్లాల్లో ఈ-హెల్త్ ప్రొఫైల్ సర్వేలు సాగుతున్నాయి' అని 2022 మార్చి 5న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు వేములవాడలో ప్రకటించారు. ఈ-హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టి జిల్లాలో 91 శాతం మేరకు నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. సరిగ్గా ఏడాది కిందట వేములవాడలో కేటీఆర్, ములుగులో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావులు ప్రారంభించిన హెల్త్ ప్రొఫైల్స్ ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

ఇంటింటా సర్వేలు

2022 మార్చి నుంచి జిల్లావ్యాప్తంగా ఆరోగ్య కార్యకర్తల బృందం ఇంటింటా సర్వే చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి సుమారు 30రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బ్లడ్‌గ్రూప్, రక్తహీనత, కిడ్నీ, కాలేయ సంబంధిత, మొదలగు పరీక్షలు సిరిసిల్లలోని తెలంగాణా డయాగ్నోస్టిక్ సెంటర్‌లో నిర్వహించారు. భవిష్యత్తులో ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో పరీక్షల వివరాలు 'డిజిటల్ హెల్త్ ప్రొఫైల్' రూపంలో కంప్యూటర్‌లో భద్రపరిచారు. ఈ సమాచారాన్ని ఆధార్ కార్డు నంబరు, మొబైల్ ఫోన్ నంబరుతో అనుసంధానం చేసినట్లు ప్రకటించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వ్యక్తులకు అవసరమైన మందులను ఉచితంగా ఇస్తామని వెల్లడించారు. జిల్లాలోని కొందరు అందుబాటులో లేకపోవడం, గల్ఫ్‌కు వలసవెళ్లడం వంటి సమస్యలతో 91 శాతం మేరకు ఇంటింటా సర్వే పూర్తి చేశారు.

ఆధునిక పరిజ్ఞానంతో పరీక్షలు

సిరిసిల్లలో టీ-డయాగ్నోస్టిక్ సెంటర్‌ను రూ.30కోట్లతో ఏర్పాటు చేశారు. ఇందులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్షలను విశ్లేషించారు. కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ పరిజ్ఞానంతో నమూనాల విశ్లేషణ, ఫలితాలు నిక్షిప్తం చేశారు. ఇందు కోసం మూడు ఇంటిగ్రేటెడ్ అనలైజర్ మిషన్‌లు, నాలుగు సీపీబీ అనలైజర్లు, ఆరు రక్తగ్రూపులు, సెంట్రల్ ప్యూజియర్‌లను ఏర్పాటు చేసి రోజుకు సగటున ఆరువేల రక్త నమూనాలను పరీక్షిస్తూ.. ఆ వివరాలను కంప్యూటర్లో నమోదు చేశారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను గోప్యంగా ఉంచారు. కలెక్టర్ పర్యవేక్షణలో సర్వేలు చేయించిన ప్రభుత్వం హెల్త్ కార్డుల జారీలో మాత్రం ఇంకా స్పష్టతనివ్వలేదు.

అత్యవసర వేళల్లో

ప్రతి ఒక్కరి పరీక్షల నివేదికలతో ప్రత్యేక ఆరోగ్య గుర్తింపు సంఖ్య గల 'ఆరోగ్య కార్డు'లో భద్రపరచి ఇస్తారు. అత్యవసర పరిస్థితులలో (ఎమర్జెన్సీ) ఈ డిజిటల్ కార్డులో తక్షణమే వైద్యసేవలు అందించేందుకు వీలుంటుంది. బ్లడ్ గ్రూప్‌తో పాటు, ఇతర అంశాలపై డాక్టర్‌కు ఆరోగ్య సమాచారం పూర్తిగా తెలిసి ఖచ్చితమైన మందులు ఇచ్చి వైద్యం చేసేందుకు, ప్రాణాపాయం నుండి కాపాడేందుకు ఈ-హెల్త్ ప్రొఫైల్ ఉపయోగపడుతుంది. ఈ ప్రాజెక్టు ప్రారంభించి ఏడాదైనా ఇంకా ఈ డిజిటల్ కార్డులు ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

బాబోయ్ లీకుల గోల..!



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, తదితరులు

- కలెక్టర్లు, సీపీ, ఎస్పీలను అలర్ట్ చేసిన ప్రభుత్వం
- ఆఖరు పరీక్ష వరకు నిర్వహణ బాధ్యత వారిదే
- నిర్లక్ష్యం వహించిన సిబ్బంది ఉద్యోగాలు పీకేస్తాం
- కలెక్టర్లు కూడా సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దు
- వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టంచేసిన మంత్రి, సీఎస్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో వరుసగా వెలుగుచూస్తున్న లీకేజీలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా ప్రస్తుతం జరుగుతున్న పదోతరగతి పరీక్షల నేపథ్యంలో మరిన్ని పకడ్బందీ చర్యలకు ఉపక్రమించింది. రెండు రోజులపాటు తెలుగు, హిందీ పరీక్షల పేపర్లు వాట్సాప్ ద్వారా వైరల్ కావడంతో పరీక్షల నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఓ వైపు టీఎస్‌పీఎస్‌సీ ఉద్యోగ పరీక్షల పేపర్లు లీకవడం, దానిపై సిట్ దర్యాప్తు జరుగుతుండగానే.. మరోవైపు పదో తరగతి పరీక్ష పేపర్లు సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతుండటాన్ని విద్యాశాఖ తీవ్రంగా పరిగణించింది. దీంతో బుధవారం నుంచి పరీక్షల నిర్వహణలో ఎలాంటి అలజడులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

అన్ని జిల్లా కలెక్టర్లతో వీసీ..!

పదో తరగతి పేపర్లు వరుసగా సోషల్ మీడియాలో ప్రత్యక్షమవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తెలుగు, మంగళవారం హిందీ పేపర్ వాట్సాప్ పేపర్లలో ప్రత్యక్షమైన తీరు పరీక్ష నిర్వహణలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది. ఇది లీకేజీ కాదని చెబుతున్న పోలీసు ఉన్నతాధికారులు వాటిని సర్క్యులేట్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. మంగళవారం ఉదయం హిందీ పేపర్ బయటికి వచ్చిన వెంటనే.. ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు వచ్చిన ఆదేశాల మేరకు వారివారి జిల్లాల్లో సెంటర్లను ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, డీజీపీ అంజనీకుమార్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్‌జయంతి, కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ సీపీ చంద్రశేఖర్, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషా, ఎస్పీ భాస్కర్, పెద్దపల్లి కలెక్టర్ సంగీత సత్యనారాయణ, రామగుండం సీపీ రెమా రాజేశ్వరితోపాటు పలువురు ఆర్డీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్లకు సైతం ఫోన్ అనుమతి లేదు..

ఎలాంటి చిన్న నిర్లక్ష్యాన్నైనా సహించేది లేదని స్పష్టంచేశారు. పరీక్షల విధుల్లో ఉన్న వారెవరైనా సరే నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారిని సస్పెండ్ చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష నిర్వహణలకు పూర్తిగా డీఈవోలను బాధ్యులను చేయాలని, అవకతవలకు పాల్పడితే రిమూవల్ సర్వీస్ చేయాలని కూడా కలెక్టర్లకు సూచించారు. అన్ని సెంటర్ల వద్ద 144 సెక్షన్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని పోలీసులకు సూచించారు. సెంటర్లను తనిఖీ చేసే కలెక్టర్లు, డీఈవోలు, తహసీల్దార్లు ఎవరైనా సరే లోనికి సెల్‌ఫోన్ అనుమతి లేదని స్పష్టంచేసినట్లు సమాచారం.

కరీంనగర్ పేరుతో ఉలికిపాటు..

మంగళవారం ఉదయం వరంగల్ జిల్లాలో వాట్సాప్‌లో ప్రత్యక్షమైన పదో తరగతి హిందీ పేపర్ ఉమ్మడి జిల్లా పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. పేపర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వాట్సాప్‌లో పోస్టులు చేశారని వార్తలు రావడంతో జగిత్యాల, సిరిసిల్ల, రామగుండం, కరీంనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇక ఇంటెలిజెన్స్ పోలీసులు కూడా ఈ వ్యవహారంలో ఆరా తీయడం ప్రారంభించారు. మొత్తానికి సాయంత్రానికి పేపర్ కరీంనగర్ జిల్లా నుంచి లీకవలేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ల అనుమతి లేదు

సిరిసిల్ల: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లోకి ఎవరికీ సెల్‌ఫోన్లు అనుమతించవద్దని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సాయంత్రం మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లే వారిలో ఎవరి వద్ద కూడా సెల్ ఫోన్ లేకుండా తనిఖీలు చేయాలన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేశ్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అసిస్టెంట్ కమిషనర్ ఆజీమ్ ఉన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి



కొదురుపాక పీహెచ్‌సీలో ఎన్‌క్వాస్ బృందం, స్థానిక వైద్యసిబ్బంది

బోయినపల్లి(చొప్పదండి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఎన్‌క్వాస్ బృందం సభ్యులు ప్రహ్లాద్ అంబదాస్ గుంజాల్ (మహారాష్ట్ర), మమ్త జైస్వాల్ (మధ్యప్రదేశ్) పేర్కొన్నారు. జాతీయ నాణ్యత ప్రమాణాల తనిఖీల్లో భాగంగా రెండోరోజు మంగళవారం కొదురుపాక పీహెచ్‌సీలో పలు తనిఖీలు చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఆసుపత్రి రికార్డులు పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి విషయంలో పలు సలహాలు సూచనలు చేసినట్లు వైద్యాధికారి రేణుప్రియాంక తెలిపారు. డీఐవో డాక్టర్ మహేశ్, డీపీవో ఉమ, పీహెచ్‌సీ వైద్యాధికారి రేణుప్రియాంక, ఆయుష్ వైద్యాధికారి శ్వేత, క్రిష్ణవేణి, జిల్లా క్వాలిటీ మేనేజర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

జగ్జీవన్ జయంతికి తరలిరండి

సిరిసిల్లకల్చరల్: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలను బుధవారం అధికారికంగా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద నిర్వహించే వేడుకలకు కలెక్టర్ అనురాగ్ జయంతితో పాటు ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొంటున్నట్లు జిల్లా ఎస్సీఅభివృద్ధి అధికారి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న దళిత సంఘాల నేతలు, సభ్యులు, ఉన్నత అధికారులు, అనధికారులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

రాజన్న సేవలో 'కోలేటి'



ప్రసాదం అందిస్తున్న తిరుపతిరావు

వేములవాడ: రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ మంగళవారం రాజన్నను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. వేదోక్త ఆశీర్వచనం గావించారు. పర్యవేక్షకులు తిరుపతిరావు, శ్రీరాములు పాల్గొన్నారు.

సిరులు కురిపించిన కురులు



వేలం నిర్వహిస్తున్న ఈవో కృష్ణప్రసాద్, పాల్గొన్న కాంట్రాక్టర్లు

- తలనీలాల సేకరణ టెండర్‌కు రూ.19.08 కోట్లు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో తలనీలాలు సేకరించుకునే హక్కు కోసం ఆలయ ఈవో కృష్ణప్రసాద్ మంగళవారం స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో బహిరంగ వేలం నిర్వహించారు. 2023–25 రెండేళ్ల కాలపరిమితి కోసం నిర్వహించిన వేలంపాటలో 11 మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా హిందూపురంకు చెందిన సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ కే.నాగరాజు రూ.19.08 కోట్ల హెచ్చుపాటదారుడిగా ఎంపికవడంతో ఆయనకు టెంటర్ అప్పగించినట్లు ఈవో ప్రకటించారు. దీంతో రాజన్నకు భక్తులకురుల ద్వారా రూ.19కోట్ల సిరులు కురిసినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. గతంలో కరోనా కారణంగా ఈ టెండర్ రూ.9 కోట్లకు వచ్చినట్లు చెప్పారు. ఈసారి రూ.10 కోట్లు అదనంగా స్వామివారికి చేకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. దేవాదాయశాఖ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈవో హరికిషన్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు గోలి శ్రీనివాస్, సిరిగిరి శ్రీరాములు, సిబ్బంది కూరగాయల శ్రీనివాస్, ఎం.రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బోయినపల్లిలో ఈదురుగాలులతో వర్షం



చెట్టును తొలగిస్తున్న సెస్ సిబ్బంది

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి, విలాసాగర్, మర్లపేట, తడగొండ, బూర్గుపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. బోయినపల్లి ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పరిసరాల్లో ఓ పెద్దచెట్టు విరిగి పూర్తిగా విద్యుత్ వైర్లపై పడింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానికులసాయంతో సెస్ సిబ్బంది విరిగిన చెట్టును తొలగించే పనులు పూర్తిచేశారు.

భూ కబ్జాదారులపై పీడీయాక్టు

- ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు
- బాధితుల పక్షాన పోలీస్‌శాఖ
- ఎస్పీ అఖిల్‌మహాజన్
- ఠాణా దివస్‌కు భారీ స్పందన



- ఈ వృద్ధురాలి పేరు నక్క లస్మవ్వ. ఫాజుల్‌నగర్ స్వగ్రామం. ఓ వ్యక్తి ఇంటి గోడ కూల్చివేసి భూమిని కబ్జా చేశాడు. ఈ విషయంపై గతంలోనూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది లస్మవ్వ. కేసు కూడా నమోదైంది. అయినప్పటికీ మళ్లీ అదే వ్యక్తి సదరు భూమిని లస్మవ్వకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తనకు న్యాయం చేయండంటూ.. మంగళవారం వేములవాడరూరల్ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన ఠాణా దివస్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసింది. నక్క లస్మవ్వనే కాదు ఠాణా దివస్‌కు వచ్చిన బాధితుల్లో ఎక్కువశాతం భూ సమస్యలు, కబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్‌ల బాధితులే.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



- ఈ వృద్ధుడి పేరు మేఘరాజు. వేములవాడ పట్టణ నివాసి. పోలీసు డిపార్టుమెంటులోనే హెడ్‌కానిస్టేబుల్‌గా రిటైర్డు అయ్యాడు. మేఘరాజుకు ముగ్గురు కొడుకులు. అందరూ బాగానే స్థిరపడ్డారు. అయినా.. రిటైర్మెంట్ డబ్బులు.. మేఘరాజు పేరిట ఉన్న స్థిరాస్తులను పంచి ఇవ్వమని కొడుకులు వేధిస్తున్నారని ఠాణాదివస్‌లో ఎస్పీకి మొరపెట్టుకున్నాడు.

వేములవాడరూరల్: ఎవరైనా భూ ఆక్రమణకు పాల్పడితే క్రిమినల్ కేసు, పీడీయాక్టు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. వేములవాడ రూరల్ మండల పోలీస్‌స్టేషన్‌లో ఠాణా దివస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లాలోనే తొలిసారి నిర్వహించిన కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి 53 మంది వివిధ రకాల ఫిర్యాదులు అందించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం పెరిగేందుకు ప్రజల వద్దకే పోలీసులు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ప్రతినెలలో మొదటి మంగళవారం ఠాణాదివస్ నిర్వహిస్తామని అన్నారు. తమ పరిధిలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని, ఇతరశాఖలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధితశాఖలకు పంపించి పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామని వివరించారు. చాలా గ్రామాల నుంచి భూ సమస్యలపైనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వాటిపై ప్రత్యేకంగా పోలీస్‌శాఖ దృష్టి సారిస్తుందని అన్నారు. భార్యాభర్తల గొడవల విషయంలో జీవనభృతి కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీతో మాట్లాడి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని, తహసీల్దార్, డీఎస్పీ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

మూడు గంటలు ఓపికతో..

ఠాణా దివస్ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ అఖిల్ మహాజన్ బాధితుల నుంచి స్వయంగా ఫిర్యాదులు తీసుకున్నారు. మధ్యాహ్నం 12గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మూడు గంటల వరకు కొనసాగింది. ఒక్కో ఫిర్యాదుదారుడితో నేరుగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. త్వరగా పరిష్కరించే విధంగా కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని అన్ని మండలాల్లోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొనసాగిస్తామని అన్నారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మండల ప్రజాప్రతినిధులు శాలువాతో సత్కరించారు. రాజన్న చిత్రపటం అందించారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు బన్సీలాల్, వెంకటేశ్, ఎస్సైలు నాగరాజు, రఫీక్‌ఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్షా కేంద్రాల్లో అదనపు కలెక్టర్ తనిఖీలు



పరీక్షా కేంద్రంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని విలాసాగర్, బోయినపల్లిల్లో పదోతరగతి పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కాగా బోయినపల్లి కేంద్రంలో 209, విలాసాగర్ కేంద్రంలో 65 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ తెలిపారు. తహసీల్దార్ దర్శెల్లి నరేశ్, ఎస్సై మామిడి మహేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడ అర్బన్: వేములవాడ పట్టణంలోని గాంధీనగర్ ఉజ్వల స్కూల్, తిప్పాపూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ మంగళవారం పరిశీలించారు. పరీక్ష రెండో రోజు ప్రశాంతంగా ముగిసినట్లు చెప్పారు. మొత్తం 1,144 మందికి గాను 1,142 మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సెస్ అసిస్టెంట్ హెల్పర్‌కు గాయాలు

వేములవాడ: పట్టణంలోని రెండో బైపాస్‌రోడ్డులో విద్యుత్ సరఫరాలో ఏర్పడిన సమస్యను మంగళవారం పరిష్కరించే క్రమంలో అసిస్టెంట్ హెల్పర్ తిరుపతికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని హుటాహుటిన స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. తిరుపతికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపినట్లు సెస్ ఉద్యోగులు పేర్కొన్నారు.

ప్రయాణికులకు చల్లని తాగునీరు



ప్రయాణికులకు నీరందిస్తున్న డీఎం మనోహర్

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్లటౌన్: బస్టాండ్‌లో ప్రయాణికులకు చల్లని నీరు అందిస్తున్నామని సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్ మంగళవారం తెలిపారు. వేసవి దృష్ట్యా బస్టాండులో ప్రయాణికుల దాహార్తి కష్టాలపై గత మార్చి నెలలో 'బస్టాండ్‌లో దాహం..దాహం' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి ఆర్టీసీ అధికారుల స్పందించారు. ఈ మేరకు బస్టాండ్‌లోని కంట్రోలర్ రూం వద్ద చల్లని తాగునీటిని ఏర్పాటు చేసి, ప్రయాణికులకు ఉచితంగా అందిస్తున్నారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కంచర్ల రవిగౌడ్, కంట్రోలర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకరి అరెస్టు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి గంగాధర్‌ను దొంగతనం కేసులో అరెస్టు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. తక్కళ్లపల్లిలో ఈ నెల 1న రాత్రి ఎండీ.సాజిద్ ఇంట్లోకి చొరబడి పీరీలకు అలంకరించే వెండి ఆభరణాలను గంగాధర్ చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. అతని వద్ద 768 గ్రాముల వెండి ఆభరణాలు దొరికాయని ఎస్సై పేర్కొన్నారు. దీంతో మంగళవారం గంగాధర్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు.

అగ్రహారం అంజన్న ముస్తాబు

- రేపు హనుమాన్ చిన్న జయంతి
- మరునటి రోజు దీక్షాపరుల మాల విరమణ
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



విద్యుత్ దీపకాంతుల్లో అగ్రహారం ఆలయం

వేములవాడఅర్బన్: భక్తుల కోర్కెలు తీర్చే.. సంకట విమోచన అగ్రహారం జోడాంజనేయ స్వామి ఆలయం హనుమాన్ దీక్షాపరులతో కాషాయమయంగా మారింది. ఈ నెల 6న నిర్వహించే హనుమాన్ చిన్న జయంతికి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

ఉదయం 4 గంటల నుంచి పూజలు..

అగ్రహారం జోడాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఉదయం 4 గంటల నుంచి అంజన్నకు పూజలు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటలకు శ్రీవారి జెండాను ఎత్తుట, స్వామివారి జెండాను ఆలయంపైన గోపురం వద్దకు తీసుకెళ్లి, ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సాయంత్రం రథోత్సవం కనులపండువలా నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరుసటిరోజు హనుమాన్ దీక్షాపరుల మాల విరమణ ఉంటుందన్నారు.

లడ్డూలు, పులిహోర తయారీ..

హనుమాన్ ఆలయ ఆధ్వర్యంలో ప్రతీరోజు సుమారు 450 లడ్డూ, 150 పులిహోర ప్యాకెట్లు తయారు చేస్తారు. హనుమాన్ దీక్ష ప్రారంభం కావడంతో 21 రోజులపాటు సుమారు 25 వేల లడ్డూలు, 20 వేల పులిహోర ప్యాకెట్లు చేస్తున్నారు. హనుమాన్ జయంతి రోజున ఒక్కరోజే సుమారు 10 వేలు లడ్డూలు, 3 వేల పులిహోర ప్యాకెట్లు తయారు చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

దీక్షలో 4 వేల మంది..

ఈ సంవత్సరం 4 వేల మంది హనుమాన్ దీక్ష తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. హనుమాన్ జయంతి మరుసటి రోజు (ఈ నెల 7న) వారికి మాల విరమణ ఉంటుందని పేర్కొన్నారు.

> **అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం**
>
> అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయంలో ఈ నెల 6న హనుమాన్ చిన్న జయంతి ఘనంగా నిర్వహిస్తాం. ఇందుకోసం భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశాం. – ఈవో మారుతి, అగ్రహారం అంజన్న ఆలయం

సాటి మనిషికి సాయపడే గుణం గొప్పది

- ఎస్పీ అఖిల్ మహాజన్
- నిరుపేద ముస్లింలకు నిత్యావసరాలు అందజేత



సరుకులు అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లటౌన్: సాటి మనిషికి సాయపడే గుణం చాలా గొప్పదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరుపేద ముస్లింలకు నిత్యావసరాలను ఆయన చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. నిరుపేదలకు సహాయం అందించడంలో తాను కూడా భూమిక పోషిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్ ఆకుల కృష్ణ, సొసైటీ నిర్వాహకులు బాబా, సలీం, పాషా, అన్సార్ పాషా తదితరులు పాల్గొన్నారు.

భర్తపై హత్యాయత్నం కేసులో భార్య, ఆమె ప్రియుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేందర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): భర్తను కడతేర్చి, ప్రియుడితో కలిసి వెళ్లిపోదామని ప్లాన్ వేసిన కిలాడీ భార్యను, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని ఇంద్రానగర్ భరత్‌నగర్ కాలనీకి చెందిన చిట్యాల శైలజ–బాలకృష్ణలకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. కాగా శైలజ తనకు వరుసకు మరిది అయ్యే చిట్యాల శ్రీకాంత్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం బాలకృష్ణకు తెలియడంతో పద్ధతి మార్చుకోవాలని ఇద్దరినీ హెచ్చరించాడు. ఈ క్రమంలో బాలకృష్ణ తమకు అడ్డుగా ఉన్నాడని, అతన్ని ఎలాగైనా చంపాలనుకున్నారు. గత మార్చి 3న శైలజ, శ్రీకాంత్‌లు కలిసి పొలం వద్ద కరెంట్ షాక్ పెట్టారు. కానీ అదృష్టవశాత్తు బాలకృష్ణ తృటిలో తప్పించుకున్నాడు. అతను చనిపోలేదని గ్రహించిన శైలజ, శ్రీకాంత్‌లు భయంతో ఇంటి నుంచి పారిపోయారు. బాలకృష్ణఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు వరంగల్‌లో తలదాచుకున్నట్లు గుర్తించి, మంగళవారం ఉదయం అరెస్టు చేసి, సిరిసిల్లకు తరలించారు. శైలజ, శ్రీకాంత్‌లను రిమాండ్‌కి తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

లీకేజీపై సీబీఐతో విచారణ జరిపించాలి

- లీకుల వీరుడు మంత్రి కేటీఆర్
- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సీబీఐతో విచారణ జరిపించాలని, అప్పుడే మరింత మంది అక్రమార్కులు బయట పడతారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కారు టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగ పరీక్షలను సమర్థంగా నిర్వహించామని చెప్పుకుంటూ.. అసమర్థ పనులకు పూనుకుందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ అలసత్వం, అక్రమాలతో లీకుల పర్వం నడుస్తోందన్నారు. గ్రీకు వీరుడని అనుకుంటున్న మంత్రి కేటీఆర్ లీకుల వీరుడిగా మారాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ నుంచి ఎస్సెస్సీ పేపర్ల వరకు ప్రశ్నపత్రాలను అమ్ముకుంటూ.. పాలన సాగిస్తున్నారని, దీనిని ప్రజాబలంతో తిప్పికొడతామని హెచ్చరించారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవదాజు, చొప్పదండి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- తంగళ్లపల్లిలో పదోతరగతి పరీక్షా కేంద్రం తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పదోతరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు ఆదేశించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని చీఫ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, కెమెరాల పర్యవేక్షణలోనే ప్రశ్నపత్రాలను ఓపెన్ చేయాలని చెప్పారు. ప్రథమ చికిత్స తదితర సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి ఎ.రమేశ్‌కుమార్, తహసీల్దార్ పి.సదానందం, చీఫ్ సూపరింటెండెంట్‌లు రవీందర్, షాబొద్దీన్ తదితరులున్నారు.

ఆరోగ్య మహిళపై అవగాహన కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమంపై ప్రతీ మహిళకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రిజిస్ట్రేషన్, పారామీటర్ల పరిశీలన, ఆన్‌లైన్ డాటా ఎంట్రీ, నిర్ధారణ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన మహిళలతో మాట్లాడారు. ఎనిమిది రకాల వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఉప వైద్యాధికారులు శ్రీరాములు, రజిత, మెడికల్ ఆఫీసర్లు స్నేహ, రేఖ, వైద్య సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

- ప్రహరీ కూలిన ఘటనలో రెండు రోజుల్లో మృత్యుఒడికి తల్లీకూతురు
- ఎల్లారెడ్డిపేటలో విషాదం



అక్షయ (ఫైల్)



ఆసుపత్రిలో అక్షయ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రహరీ ఆ ఇంట్లో తీరని విషాదం నింపింది. మృత్యుశకటంగా మారి తల్లీకూతురు ప్రాణాలు తీసింది. ఈ హృదయ విదారకర ఘటనతో ఎల్లారెడ్డిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక అంబేడ్కర్‌నర్‌కు చెందిన ఆరె దేవవ్వ(36), ఆమె కూతురు అక్షయ(16)లు కలిసి సోమవారం తమ ఇంటివద్ద ప్రహరీని ఆనుకొని ఇసుక పోశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కూలి, వారిపై పడింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. దేవవ్వ భర్త నర్సయ్య వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించగా అప్పటికే దేవవ్వ మృతిచెందింది. అక్షయను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న అక్షయ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు మంగళవారం ఉదయం చెప్పారు. ఒకవైపు కూతురు చావు బతుకుల్లో ఉండగానే కుటుంబసభ్యులు, బంధువులు తల్లి మృతదేహానికి సాయంత్రం దహనసంస్కారాలు పూర్తి చేసి, ఇంటికి వచ్చారు. అప్పుడే వారికి అక్షయ కూడా చనిపోయినట్లు తెలిసి, కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండు రోజుల వ్యవధిలో తల్లీకూతురు మృతితో స్థానికులు కంటతడి పెట్టారు. దేవవ్వ భర్త నర్సయ్య దినసరి కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అక్షయ ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆమె త్వరగా కోలుకోవాలని సహచర విద్యార్థులు స్థానిక ఆలయాల్లో చేసిన పూజలు ఫలించలేదు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

ఆరుగాల రైతు కష్టం.. దొంగలపాలు

- కల్లంలో నుంచి పసుపు దొంగిలించిన దుండగులు
- కన్నీరుమున్నీరైన బాధిత కుటుంబం



దొంగలు ఎత్తుకెళ్లగా మిగిలిన పసుపును రోదిస్తూ చూపిస్తున్న రైతు దంపతులు

రుద్రంగి(వేములవాడ): చీడపీడలు, కష్టనష్టాలకు ఓర్చి పంట పండించిన రైతన్నలకు దొంగల నుంచి కూడా ముప్పు తప్పడం లేదు. పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రంలోని కల్లంలో పోస్తే రాత్రి వేళల్లో దొంగలు ఎత్తుకెళ్తున్నారని రైతన్నలు అంటున్నారు. తాము ఆరుగాలం పడిన కష్టం ఒక్క రాత్రిలో దొంగల పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కొందరు రైతులు పసుపు తవ్వి, లింగంపేట పల్లె తాతమ్మ గుడి ఆవరణలో గల వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉడకబెట్టి, ఆరబెట్టుకున్నారు. సోమవారం రాత్రి దుండగులు రుద్రంగి మండల కేంద్రానికి చెందిన గడ్డం మహేందర్‌కు సంబంధించిన సుమారు 3 క్వింటాళ్ల పసుపును ఎత్తుకెళ్లారు. దీనివల్ల తనకు రూ.20 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు రోదిస్తూ తెలిపాడు. 9 నెలలపాటు తాను పడిన కష్టం ఇలా దొంగలపాలైందని వాపోయాడు. సోమవారం రాత్రి 7 గంటల వరకు పసుపు ఆరబెడుతూ కల్లంలోనే ఉన్నామని.. మరుసటిరోజు వచ్చి చూస్తే పసుపు కనిపించలేదని మహేందర్ దంపతులు విలపించారు. దొంగలను పట్టుకొని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

గతంలో వరిధాన్యం చోరీ..

వరి ధాన్యం కొనుగోళ్ల సమయంలోనూ పలువురు రైతులకు చెందిన ధాన్యాన్ని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతోనే మళ్లీ ఇలాంటి ఘటనలు జరిగి, రైతులు నష్టపోతున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి, దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో చోరీ

- పలువురి జేబుల్లో నుంచి రూ.60 వేలు మాయం చేసిన దొంగలు

కథలాపూర్(వేములవాడ): మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ సమయంలో జేబుదొంగలు తమ పని కానిచ్చేశారు. కథలాపూర్ మండలంలోని కలిగోట గ్రామానికి చెందిన పత్రి నర్సయ్య జేబులో నుంచి రూ.50 వేలు, తాండ్యాల గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగారావు జేబులో నుంచి రూ.10 వేలు కాజేశారు. మరో ఇద్దరు నాయకులకు చెందిన రూ.2 వేల చొప్పున మాయమయ్యాయి. కానీ వారు బయటకు చెప్పడానికి ఇష్టపడటం లేదు. ఆత్మీయ సమ్మేళనానికి ఎక్కువ మంది హాజరవడం దొంగలకు కలిసొచ్చినట్లయిందని పలు వురు బీఆర్ఎస్ నాయకులు వాపోయారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన సాగర్ల మల్లేశ్(43) క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాలు.. మల్లేశ్ సింగరేణి సంస్థలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుండగా, రెండునెలల క్రితం అతడి తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడం, అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురైన మల్లేశ్ సోమవారం క్రిమిసంహార మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా, కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు అంజనివరప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెరుగైన ఒప్పందం సాధించేలా కృషి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): కోల్‌కత్తాలో ఈనెల 18న జరిగే 11వ వేతన ఒప్పందంలో మెరుగైన అగ్రిమెంట్ సాధించేలా కృషి చేస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. మంగళవారం ఓసీపీ–3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. వేజ్ బోర్డులో 19శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్ అంగీకారం కుదిరిందన్నారు. మిగిలిన అంశాలపై మేనేజ్‌మెంట్ పూర్తిస్థాయిలో సానుకూలమైన వాతావరణంలో చర్చలు జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. వేతన పరిష్కారంలో మిగిలిన ఇతర అంశాలపై ఇంకా ఏకాభిప్రాయం లేకున్నా ఒప్పందం కుదిరిన తర్వాతే మంత్రిత్వశాఖ ఆమోదం కోసం పంపబడుతుందన్నారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని త్వరలో వేజ్‌బోర్డు ఒప్పందం ఖరారు చేసేలా కోల్ ఇండియా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి కుమారస్వామి, సారంగపాణి, మాదాసు రవీందర్, నీలం రవి, మంచినీళ్ల స్వామి, చిర్ర ఆంజనేయులు, పోతరాజు భాస్కర్, యాదగిరి నరేష్, ఈదునూరి శ్రీనివాస్, ఉప్పులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బలగం సినిమా చూసి ఒక్కటైన కుటుంబం



బలగం సినిమా చూసి కలిసిన కుటుంబం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): బలగం సినిమా చూసి స్పందించిన ఓ కుటుంబం కలహాలు వీడి ఒక్కటైంది. వివరాలు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్టనంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వద్ద సోమవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. గ్రామస్తులు భారీసంఖ్యలో తరలివచ్చి సినిమా తిలకించారు. సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూస్తూ గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. అయితే, గ్రామానికి చెందిన అన్నదమ్ములు బొప్పరతి సంజీవ్, రాజేందర్, జనార్దన్ కుటుంబాలు కూడా సినిమా తిలకించాయి. ఈ మూడు కుటుంబాలు మనస్పర్థలతో 15ఏళ్లుగా మాట్లాడుకోవడంలేదు. వీరి తల్లి బొప్పరాతి తారబాయి మంగళవారం ఉదయం వృద్ధాప్య కారణాలతో మృతి చెందింది. బలగం సినిమాలో మాదిరిగానే ముగ్గురు అన్నదమ్ములు, వారి కుటుంబాలు కలిసిపోయాయి. తల్లి అంతిమయాత్ర నిర్వహించాయి.

లీకేజీ నీరు.. మొక్కలకు చేరు



సిరిసిల్ల: స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద సినారె స్మారక గ్రంథాలయం ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ గేట్‌వాల్వ్ నిత్యం లీకవుతూ నీరు వృథాగా పోతోంది. రోడ్డుపై పారుతుండటంతో గమనించిన స్థానికులు గేట్‌వాల్వ్ నీటి లీకేజీకి ఒక సీసాను బిగించి, దానికి ప్లాస్టిక్ పైపు తొడిగారు. దీనిద్వారా లీకేజీ నీటిని గ్రంథాలయం ముందున్న గార్డెన్‌లోని మొక్కలకు మళ్లించారు. మండుటెండల్లో మొక్కలను నీరందుతుండగా ఎండిపోకుండా పచ్చగా కనిపిస్తున్నాయి. ఎప్పుడూ నీటితో కనిపించే రోడ్డు శుభ్రంగా మారింది.



బస్సు కాదు.. పాఠశాల తరగతి గది

సిరిసిల్ల: పైన ఫొటో విద్యార్థులు బస్సు ఎక్కుతున్నట్లుగా ఉంది కదూ.. అలా అనుకుంటే పొరబడినట్లే. ఇది బస్సు కాదు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గూడెం పాఠశాల తరగతి గది. గివ్ ఫౌండేషన్ సీఎస్సార్ నిధులు, మంత్రి కేటీఆర్ చొరవతో తరగతి గదులపై ఆకట్టుకునేలా చిత్రాలు వేయించారు. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన చిత్రకారుడు నారోజు చంద్రశేఖర్ వీటిని వేశాడు. బస్సును పోలినట్లుగా ఉన్న బడిలోని తరగతి గది విద్యార్థులను అమితంగా ఆకట్టుకుంటోంది.